వన్యప్రాణుల అక్రమ రవాణా రాకెట్ గుట్టురట్టు

వాహనంలో తరలిస్తున్న అడవి పందులు

సోన్, జూన్ 3: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఉమ్రి నుంచి నిజామాబాద్ మార్గంలో అడవి పందులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 1న రాత్రి సోన్ చెక్‌పోస్టు వద్ద ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుజాత అప్రమత్తమై వాహనాలను తనిఖీ చేపట్టారు. నిర్మల్ నుంచి వస్తున్న ఏపీ 39 యుకే 9152 నంబరు గల అశోక్ లేలాండ్ పికాప్ వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా వాహనంలో నుంచి ఒక వ్యక్తి దూకి పారిపోయాడు. వాహనంలో ఉన్న మరో వ్యక్తిని పట్టుకొని వాహనాన్ని తనిఖీ చేయగా 13 అడవి పందులు కనిపించడంతో నిందితుడిని ఆరా తీయగా ఏ1 బి.జాను, ఏ2 బండి వెంకనబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. కాల్ డేటా ఆధారంగా మరికొందరు ఈ వన్యప్రాణుల అక్రమ రవాణాలో ఉన్నట్లు తెలుస్తోందని వారి కోసం అటవీ అధికారులు మరింత లోతుగా విచారణ చేపట్టారు. వన్యప్రాణి (సంరక్షణ) చట్టం 1972, వన్యప్రాణి (సంరక్షణ) సవరణ చట్టం 2022 కింద కేసు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి ఫస్ట్‌క్లాసు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా 14రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి పంపించామన్నారు.

11 నుంచి సదరం శిబిరాలు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 3 : ఈ నెల 11 నుంచి నిర్మల్ జిల్లాలోని దివ్యాంగులకు సద రం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని వైద్యుని ఓపీ స్లిప్, అవుట్ పేషంట్ స్లిప్ ద్వారా దివ్యాంగుల కేటగిరి నిర్ధారించుకొని దాని ప్రకారం మీసేవలో స్లాట్‌బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. కొత్తగా స్లాట్ బుక్ చేసుకునే వారు ఎప్పుడైనా స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 5 నుంచి రెన్యూవల్ స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 11, 14,19 న ఆర్థోపెడిక్, 26న దృష్టి లోపం ఉన్నవారికి సదరం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పై తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

గాంధీగంజ్‌లో సందడి

భైంసాలో విత్తన దుకాణాల్లో నెలకొన్న సందడి

భైంసా, జూన్ 3 : భైంసా పట్టణం గాంధీ గంజ్‌లోని విత్తనాల దుకాణాల వద్ద సోమవారం సందడి నెలకొంది. పట్టణంతో పాటు ఆయా మండలాల్లోని గ్రామాలు, మహారాష్ట్ర నుంచి సైతం రైతులు వచ్చి విత్తనాలు కొనుగోలు చేశారు.

డయాలసిస్ కావాలంటే.. ఆయాసపడాలి..

రేలింగ్ సహాయంతో డయాలసిస్ సెంటర్‌లోకి వెళ్తున్న రోగి

డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు

భైంసాటౌన్, జూన్ 3 : నిర్మల్ జిల్లా భైంసాలోని ప్రాంతీయ దవాఖానలో ఇటీవల ప్రారంభించిన డయాలసిస్ సెంటర్‌తో రోగులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా వైద్య సేవలు పొందే అవకాశం లభించింది. కాని కిడ్నీ బాధితులు దవాఖానకు వచ్చాక పై అంతస్తులో ఉన్న డయాలసిస్ సెంటర్‌కు చేరుకోవాలంటే 20కి పైగా మెట్లను ఎక్కాల్సి ఉండడంతో రెండు, మూడు మెట్లు ఎక్కగానే చెమటలు పడుతున్నాయి. రేలింగ్ సహాయంతో అయాసపడుతూ అతి కష్టంతో పై అంతస్తు పైకి వెళ్లి డయాలసిస్ సెంటర్‌కు చేరుకుంటున్నారు. బాధితుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉన్నా సహాయకులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డయాలసిస్ కోసం మెట్లపై నుంచి వెళ్లి రావడం వల్ల అరికాళ్లల్లో నొప్పి పుట్టి కాళ్లతో పాటు శరీరం వణుకుతున్నదని రోగులు వాపోతున్నారు.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

నేను గత నెల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాను. భైంసా పట్టణ ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌కు మూడు, నాలుగు సార్లు రావడం జరుగుతున్నది. డయాలసిస్ సెంటర్ అందుబాటులో ఉండడం సంతోషకర విషయమే అయినా సెంటర్‌కు చేరుకోవాలంటేనే ఇబ్బందులు పడుతున్నాను. సెంటర్‌కి రాను, పోను మొత్తం 40కి పైగా మెట్లను ఎక్కి దిగాల్సి వస్తున్నది. దీంతో శరీరానికి తీవ్ర చెమట పడుతున్నది. రెండు, మూడు మెట్లెక్కి ఆగి ఆగి వెళ్లాల్సి వస్తున్నది. సెంటర్‌లోకి వెళ్లాలంటేనే ఆయాసపడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పై అంతస్తుకు వెళ్లడానికి సదుపాయం కల్పించాలని కోరుతున్నాను.

-కమల్‌దాస్ గోరేకర్, కుభీర్, డయాలసిస్ పేషెంట్

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 3 : సిరికొండకు చెందిన సూర్యవంశీ రాజేశ్వర్(32) ఆర్మీ జవాన్ ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో విధులు నిర్వహిస్తున్న రాజేశ్వర్ తన భార్యను రాత్రి ఆదిలాబాద్‌కు రైలు ఎక్కించాడు. రాజేశ్వర్ కాన్పూర్‌లోని తన ఇంటికి వెళ్లిన తర్వాత కొద్దిసేపటికి గుండెపోటుతో మృతి చెందాడు. ఆర్మీ జవాన్లు రాజేశ్వర్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మృతి చెందినట్లు సమాచారం అందించారు. భార్య ఆదిలాబాద్ చేరుకోక ముందే భర్త మరణ వార్త విని షాక్‌కు గురై తిరిగి వెళ్లిపోయింది. మృతదేహానికి సైనిక లాంఛనాల అనంతరం మంగళవారం స్వగ్రామమైన సిరికొండకు తరలించనున్నట్లు తెలిసింది.

సూర్యవంశీ రాజేశ్వర్(ఫైల్)

మైనర్లకు బైక్ ఇస్తే భారీ జరిమానా..!

- రూ.25 వేలు జేబులో పెట్టుకోండి
- ఇక కఠిన రూల్స్
- లైసెన్స్‌ల జారీ సులభతరం
- సర్టిఫికెట్‌తో డ్రైవింగ్ శిక్షణ

ఇచ్చోడ, జూన్ 3: మీ బండి మైనర్ చేతికిచ్చారా... అయితే మీ జేబులో రూ.25 వేలు రెడీగా పెట్టుకోవాల్సిందే. ఇక మీద రూల్స్ కఠినంగా ఉండనున్నాయి. వాహన చట్టంలో కీలక మార్పులు జూన్ 1 నుంచి అమలులలోకి తీసుకువస్తున్నారు. ప్రజలు ఇకపై అప్రమత్తంగా ఉండాల్సిందే. అడ్డగోలుగా వాహనాలు నడుపుతామని, స్వల్ప మొత్తాలే కదా జరిమానాలు కడతామంటే చట్టాలు ఒప్పుకోవు. తాజాగా ప్రమాదాలకు కారణమవుతున్న మైనర్ల డ్రైవింగ్ మరి కఠినతరం కానుంది. శిక్షలతో పాటు భారీగా జరిమానాలు అమలులోకి తీసుకురానున్నారు. అతివేగంగా వాహనం నడిపితే రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.500, మైనర్ వాహనం నడిపితే భారీ మొత్తంలో రూ.25 వేల చొప్పున జరిమానా విధించి ఎంవీఐ యాక్టుతో పాటు, పోలీస్ యాక్టు ప్రకారం శిక్షలు అమలు చేయనున్నారు. ఇలా ఒకసారి వాహనం నడుపుతూ పట్టుబడితే ఆ వ్యక్తికి 25 ఏళ్లు నిండే వరకు లైసెన్సు ఇవ్వకుండా నిషేధం విధిస్తారు. ఇలా కఠిన ఆంక్షలు జూన్ 1 నుంచే అమలులోకి వస్తున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పోలీస్, రవాణా శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా వాహనాన్ని నడిపేందుకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. ఈ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలంటే ముందుగా స్లాట్ బుకింగ్, డ్రైవింగ్ టెస్ట్, బయోమెట్రిక్ తదితర అంశాల కోసం ఆర్టీవో కార్యాలయం చుట్టూ నాలుగైదు సార్లు తిరిగితే గానీ అందుకోలేరు. ఈ నేపథ్యంలో లైసెన్స్ లేకుండా కొందరు, లైసెన్స్‌కు అర్హత వయస్సు సాధించని మైనర్లు యథేచ్ఛగా వాహనాలు నడుపుతున్నారు. ఈ సమస్యలకు చెక్ పెడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. దీని ప్రకారం ఆర్టీవో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయన అవసరం లేదు. స్లాట్ బుకింగ్, డ్రైవింగ్ టెస్ట్ అవసరం లేదు. ఎటువంటి టెస్టులేకుండానే తేలిగ్గానే డ్రైవింగ్ లైసెన్స్ పొందొచ్చు.

వీరే అర్హులు...

హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆరు వారాలు, 39 గంటల శిక్షణ అవసరం. 31 గంటల పాటు ప్రాక్టికల్, మిగతా ఎనిమిది గంటలు థియరీ ఉంటుంది. ఈ నిబంధనలు పాటించే వారికి మాత్రమే డ్రైవింగ్ టెస్ట్ సర్టిఫికెట్ జారీ చేసే అధికారం కల్పిస్తుంది కేంద్ర రోడ్డు రవాణా సంస్థ. ఇలా ప్రైవేట్ డ్రైవింగ్ సంస్థల ద్వారా తీసుకునే డ్రైవింగ్ సర్టిఫికెట్‌తో లైసెన్స్ కోసం దరఖాస్తు చేయాలి. అలా చేస్తే ఎటువంటి ఇతర పరీక్ష లేకుండానే లైసెన్స్ మంజూరు అవుతుంది. అయితే ముందుగా ఆర్టీవో కార్యాలయంలో ఎల్ఎల్ఆర్ తీసుకున్న తర్వాత ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

డ్రైవింగ్ టెస్టుతో పాటు...

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని రోడ్డు రవాణా సంస్థ జారీ చేసిన నిబంధనల ప్రకారం ఇక నుంచి ప్రైవేట్ డ్రైవింగ్ ఇన్‌స్టిట్యూట్‌లే డ్రైవింగ్ టెస్టులు నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేస్తాయి. డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తి చేశాక.. టెస్ట్ చేసి మరి ప్రైవేట్ డ్రైవింగ్ ఇన్‌స్టిట్యూట్లు డ్రైవింగ్ సర్టిఫికెట్ జారీ చేస్తాయి. ఈ సర్టిఫికెట్ ఆధారంగా డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే తేలిగ్గానే పొందొచ్చు.

ఇవీ రూల్స్...

అన్ని రకాల డ్రైవింగ్ సంస్థలకు కేంద్ర రోడ్డు రవాణా సంస్థ ఈ తరహా అనుమతులు ఇవ్వదు. ఫోర్‌వీల్ డ్రైవింగ్ టెస్ట్ సంస్థకు మూడెకరాల భూమి ఉండాలి. నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ టెస్టులు నిర్వహించడానికి అన్ని సౌకర్యాలు ఉండాలి. డ్రైవింగ్ శిక్షణ ఇచ్చే వారు కూడా హైస్కూల్ విద్య పూర్తి చేసుకోవడంతో పాటు డ్రైవింగ్‌లో ఐదేండ్ల అనుభవంతో పాటు బయోమెట్రిక్ టెక్నాలజీపై అవగాహన ఉండాలి. లైట్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ నాలుగు వారాలు గానీ, కనీసం 29 గంటల శిక్షణ గానీ ఉండాలి. ఇందులో 21 గంటలు ప్రాక్టికల్, ఎనిమిది గంటలు థియరీ ఉండాలి.

జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు

దేశ వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుంచి అనేక నిబంధనలు మారబోతున్నాయి. ఇకపై అతివేగంతో వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు జరిమానా విధిస్తారు. మైనర్ డ్రైవింగ్ చేస్తూ దొరికిపోతే రూ.25 వేల జరిమానా వేస్తారు. అలాగే 25 ఏళ్లు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్‌కు అనర్హులుగా ప్రకటిస్తారు. వాహన యజమాని రిజిస్ట్రేషన్ కార్డు (ఆర్సీ)ని రద్దు చేస్తారు. కొత్త డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనల మేరకు ఇకపై ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లకుండానే డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చు. ఆర్టీవో కేంద్రాలకు బదులుగా ప్రైవేట్ శిక్షణ కేంద్రాలు డ్రైవింగ్ టెస్టులను నిర్వహించి సర్టిఫికెట్లను జారీ చేయొచ్చు.

- భీమేశ్, ఇచ్చోడ సీఐ

రైతన్నా జర భద్రం..

బజార్‌హత్నూర్ కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను కర్ర సహాయంతో పైకి లేపి వ్యవసాయ పనులు చేస్తున్న రైతు

బజార్‌హత్నూర్‌జూన్ 3 : బజార్‌హత్నూర్ మండలం కొల్హారి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయి. వ్యవసాయ పనులకు ఆటంకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో రైతు కర్ర సహాయంతో వైర్లను పైకిలేపుతూ మరోపక్క ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతూ కనిపిస్తున్న దృశ్యం నమస్తే తెలంగాణ కెమెరాకు చిక్కింది.

వాణిజ్య

వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గవ్!

ఈ ఏడాది ఆఖరుదాకా ఇంతే • పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయల్

న్యూఢిల్లీ, జూన్ 3: వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గబోవని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ కుమార్ గోయల్ అన్నారు. ఈ ఏడాది ఆఖరుదాకా ఇంతేనన్న ఆయన.. డిసెంబర్ ద్రవ్యసమీక్షలో కోతలకు వీలుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బుధవారం (జూన్ 5) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ప్రారంభించనున్నది. శుక్రవారం (జూన్ 7) నిర్ణయాలను ప్రకటించనున్నది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ ఎండీ గోయల్ అంచనా ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. కరోనా సమయంలో దిగాలు పడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్సాహపర్చేందుకు.. ఆర్బీఐ పెద్ద ఎత్తున వడ్డీరేట్లను తగ్గించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పరిస్థితులు చక్కబడటంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వడ్డీరేట్లను భారీగా పెంచుతూ పోయిన సంగతీ విదితమే. దీంతో రెపో రేటు 6.50 శాతానికి చేరింది. ఫలితంగా అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లూ పెరిగాయి.

ఈఎంఐల భారం..

కరోనా సమయంలో వడ్డీరేట్లు తగ్గడంతో అంతా గృహ, వాహన, వ్యక్తిగత రుణాలను తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఆ వడ్డీరేట్లు పెరగడంతో ఆయా రుణాల ఈఎంఐ (నెలవారీ వాయిదాలు)లు భారంగా తయారయ్యాయని రుణగ్రహీతలు లబోదిబోమంటున్నారు. ఈసారి తగ్గుతాయంటూ.. ప్రతీసారీ ఎదురుచూస్తూనే ఉన్నారు. అయినప్పటికీ వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ తమ ద్రవ్యసమీక్షల్ని ముగించేస్తున్నది. గత 8సార్లూ ఇదే జరిగింది. ఈ నేపథ్యంలో రాబోయే ద్రవ్యసమీక్షపై గట్టిగానే ఆశలు పెట్టుకున్నారంతా. కానీ వస్తున్న అంచనాలు నీరుగార్చేలా ఉంటున్నాయి. 'వడ్డీరేట్లు అనేవి వృద్ధి, ద్రవ్యోల్బణం, వివిధ దేశాల్లో ద్రవ్య విధానాల వంటి రకరకాల అంశాలపై ఆధారపడి ఉంటాయి. అయితే ఇప్పటికే ఆర్బీఐ.. కీలక వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయికి చేర్చింది. బహుశా ఈ ఏడాది ఆఖర్లో తగ్గింపులకు అవకాశాలున్నాయని చెప్పుకోవచ్చు' అని గోయల్ అన్నారు.

డిపాజిట్లపై వడ్డీలు పెరగవు

డిపాజిట్లపై వడ్డీరేట్లు ఇక పెద్దగా పెరగబోవని, 95 శాతం డిపాజిట్ల వడ్డీరేట్లను ఇప్పటికే సవరించడం జరిగిందని గోయల్ తెలిపారు.

దీంతో మరో 4-5 నెలలు వడ్డీరేట్లపై స్థబ్ధత ఉంటుందన్న సంకేతాలనిచ్చారు. కాగా, రిటైల్, వ్యవసాయ రంగాలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) సంస్థలకు రుణాలివ్వడంపై పీఎన్‌బీ దృష్టిపెట్టినట్టు గోయల్ చెప్పారు. అయినప్పటికీ రుణ చరిత్ర బాగున్న కార్పొరేట్ సంస్థలకూ లోన్లిస్తామన్నారు. మౌలిక రంగ ప్రాజెక్టుల నుంచి, ముఖ్యంగా రహదారుల ప్రాజెక్టుల నుంచి రుణాలకు డిమాండ్ ఉందని చెప్పారు.

సాథీ 2.0 మొబైల్ యాప్

- ఇన్వెస్టర్ల కోసం తెచ్చిన సెబీ

న్యూఢిల్లీ, జూన్ 3: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. సోమవారం 'సాథీ 2.0' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పర్సనల్ ఫైనాన్స్‌లోని సంక్లిష్ట ఆర్థిక అంశాలను సరళతరం చేయడమే లక్ష్యంగా సమగ్ర సాధనాలతో మదుపరుల కోసం ఈ నయా మొబైల్ అప్లికేషన్‌ను సెబీ తీసుకొచ్చింది. 'ఆధునికీకరించిన 'సాథీ' యాప్ ఎంతో యూజర్ ఫ్రెండ్లీ'గా ఉంటుందని ఓ ప్రకటనలో సెబీ పేర్కొన్నది. ఇందులో ఫైనాన్షియల్ క్యాలిక్యులేటర్స్, మాడ్యుల్స్ ఉంటాయని, స్టాక్ ఎక్స్చేంజీల్లో షేర్ల క్రయవిక్రయాలు, మ్యూచువల్ ఫండ్స్, ఈటీఎఫ్ లావాదేవీలతోపాటు కేవైసీ నిబంధనల వివరణ వంటివన్నింటినీ పూర్తిస్థాయిలో తెలుసుకోవచ్చని సెబీ ఈ సందర్భంగా చెప్పింది. అంతేగాక మదుపరుల సమస్యలకు పరిష్కార వ్యవస్థ, ఆన్‌లైన్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఓడీఆర్) వేదిక కూడా ఉందన్నది. ఇన్వెస్టర్ల పర్సనల్ ఫైనాన్స్ ప్లానింగ్ కోసం అవగాహనను పెంచే వీడియోలు కూడా ఉంటాయి. కాగా, ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, యాపిల్ మొబైల్ వినియోగదారులు ఐవోఎస్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కియా కారెన్స్ @ 1.5 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 3: దేశీయ వాహన మార్కెట్‌లో కియా కారెన్స్ జోరు మీదున్నది. 27 నెలల్లో 1.5 లక్షల యూనిట్ల అమ్మకాలను దాటింది. టయోటా ఇన్నోవా క్రిస్టా, మారుతీ సుజుకీ ఎర్టిగా తదితర మాడళ్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ.. వాహనదారులను ఆకట్టుకుంటూ అమ్మకాల్లో దూసుకుపోతున్నది. 2022 ఫిబ్రవరిలో మార్కెట్‌కు పరిచయమైన కియా కారెన్స్‌లో సన్‌రూఫ్, మల్టీ డ్రైవ్ మోడ్స్, వెంటిలేటెడ్ సీట్స్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ ఉన్నాయి. ఇక ఈ కారు ధరల శ్రేణి రూ.12.88-23.94 లక్షల మధ్య ఉన్నది.

టైగున్, వర్చుస్ మాడళ్లలో 6 ఎయిర్ బ్యాగులు

ముంబై, జూన్ 3: జర్మనీ ఆటో రంగ దిగ్గజం ఫోక్స్‌వాగన్.. భారత్‌లో అమ్ముతున్న 5-స్టార్ గ్లోబల్ ఎన్‌సీఏపీ సేఫ్టీ రేటింగ్ ఉన్న టైగున్, వర్చుస్ అన్ని వేరియంట్ల కార్లలో 6 ఎయిర్ బ్యాగులను ఆఫర్ చేస్తున్నది. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ తెలిపింది. 2021 సెప్టెంబర్‌లో టైగున్, 2022 మార్చిలో వర్చుస్ మాడళ్లను దేశీయ మార్కెట్‌కు ఫోక్స్‌వాగన్ పరిచయం చేసింది. ఇటీవలే టైగున్ జీటీ లైన్, జీటీ ప్లస్ స్పోర్ట్ వేరియంట్లను తీసుకొచ్చింది. వీటిలో 1, 1.5 లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్లుంటాయి. కార్ల ధరల శ్రేణి రూ.11.5 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్య ఉన్నది.

పరేఖ్ జీతం రూ.66.24 కోట్లు

న్యూఢిల్లీ, జూన్ 3: ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ వార్షిక వేతనం గత ఆర్థిక సంవత్సరం (2023-24) 17 శాతం పెరిగి రూ.66.24 కోట్లకు చేరింది. దీంతో ఐటీ పరిశ్రమలో అత్యధిక జీతం పొందుతున్న సాఫ్ట్‌వేర్ కంపెనీల సీఈవోల్లో పరేఖ్ కూడా చేరిపోయారు. 2022-23లో పరేఖ్ జీతం రూ.56.4 కోట్లుగా ఉన్నది. ఇన్ఫోసిస్ తాజా వార్షిక నివేదిక ప్రకారం పరేఖ్ బేస్ సాలరీ రూ.7 కోట్లు. మిగతాదానిలో స్టాక్స్, వేరియబుల్ పేమెంట్స్ ఇతరత్రా ఉన్నాయి. ఇక టీసీఎస్ సీఈవో వేతనం రూ.25 కోట్లకుపైగా ఉన్నది.

ప్రపంచ సీఈవోల్లో..

ఎస్‌అండ్‌పీ 500 కంపెనీల సీఈవోల వేతనాలు గత ఏడాది దాదాపు 13 శాతం పెరిగాయి. దీంతో సాధారణ ఉద్యోగులకు, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల జీతాలకు మధ్య వ్యత్యాసం ఇంకా పెరిగిపోయినట్టైంది. బ్రాడ్‌కామ్ సీఈవో హాక్ టాన్ వేతనం దాదాపు 162 మిలియన్ డాలర్లుగా ఉన్నది. ఇదే అత్యధికమని ఓ తాజా సర్వేలో తేలింది. ఇదిలావుంటే 2023లో అత్యధిక జీతాలు తీసుకున్న సీఈవోల్లో మహిళల సంఖ్య పెరిగింది. అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్ సీఈవో లిసా సు అగ్రస్థానంలో ఉన్నట్టు ఏపీ తెలియజేసింది.

బెటర్ న్యూట్రిషన్‌లో సింధు పెట్టుబడులు



న్యూఢిల్లీ, జూన్ 3: భారత స్టార్ షట్లర్, తెలుగు క్రీడాకారిణి పీవీ సింధు.. గ్రీన్‌డేకు చెందిన 'బెటర్ న్యూట్రిషన్' బ్రాండ్‌లో పెట్టుబడులు పెట్టారు. ఈ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఉన్నట్టు సోమవారం ఆమె ప్రకటించారు. బయోఫోర్టిఫైడ్ ఫుడ్స్ ద్వారా దేశంలో సూక్ష్మ పోషకాల కొరతను అధిగమించడమే లక్ష్యంగా ఈ బ్రాండ్ మార్కెట్‌లోకి వచ్చింది. కాగా, దేశంలో పోషకాహార లోపం ప్రధాన సమస్యగా తయారైందని, ఈ ఉత్పత్తులతో దాన్ని అధిగమించవచ్చని సింధు ఈ సందర్భంగా తెలిపారు.

ఇంకా రాని రూ.2వేల నోట్లు రూ.7,755 కోట్లు

ముంబై, జూన్ 3: చలామణి నుంచి ఇంకా వెనక్కిరాని రూ.2,000 నోట్లు 2.18 శాతం ఉన్నాయని, వాటి విలువ రూ.7,755 కోట్లుగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం ప్రకటించింది. ఇప్పటిదాకా 97.82 శాతం రూ.2వేల నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగొచ్చాయని చెప్పింది. 2023 మే 19న చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు చలామణిలో ఉన్న ఈ నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లు. ఇదిలావుంటే నిరుడు అక్టోబర్ 7దాకా దేశంలోని అన్ని బ్యాంక్ శాఖల్లో రూ.2,000 నోట్ల మార్పిడి జరిగింది. ఆ తర్వాత నుంచి హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో మాత్రమే ఈ మార్పిడికి వీలుంటున్నది.

మార్కెట్ కిర్రాక్ షో

ఆద్యంతం ఎగ్జిట్ పోల్స్ జోష్ • ఆల్‌టైమ్ హై గరిష్ఠాలకు సూచీలు

రికార్డు స్థాయిలో సెన్సెక్స్ 2,507, నిఫ్టీ 733 పాయింట్లు అప్

ముంబై, జూన్ 3: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో పరుగులు పెట్టాయి. ఉదయం ప్రారంభమైన దగ్గర్నుంచి మధ్యాహ్నం ముగిసేదాకా సూచీలు ఫుల్ జోష్‌ను కనబర్చాయి. శనివారం చివరి విడుత పోలింగ్ ముగిశాక విడుదలైన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు.. మదుపరుల్లో కొత్త ఊపును తీసుకొచ్చాయని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. కేంద్రంలో మరోసారి మోదీ సర్కారే వస్తుందన్నట్టుగా సీట్ల లెక్కలున్నాయి. ఈ క్రమంలోనే అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ.. ఆల్‌టైమ్ హై రికార్డులకు చేరాయి. సెన్సెక్స్ 2,507.47 పాయింట్లు లేదా 3.39 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 76,468.78 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో తొలిసారి 76,738.89 స్థాయిని తాకింది. నిఫ్టీ 733.20 పాయింట్లు లేదా 3.25 శాతం ఎగబాకి గతంలో ఎప్పుడూ లేనివిధంగా 23,263.90 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో మొదటిసారి 23,338.70 స్థాయిని చేరింది. ఇదిలావుంటే 2021 ఫిబ్రవరి 1 నుంచి సెన్సెక్స్, నిఫ్టీలు ఒక్కరోజే ఈ స్థాయిలో పెరుగడం ఇదే తొలిసారి. నాడు కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో దాదాపు 5 శాతం పుంజుకున్నాయి. 2019 మే 20న కూడా ఎగ్జిట్ పోల్స్ అంచనాల మధ్య స్టాక్ మార్కెట్లు 3 శాతానికిపైగా పెరిగాయి. మరోసారి ఎన్డీఏ ప్రభుత్వమే గద్దెనెక్కుతుందన్న అంచనాలు.. పెట్టుబడులకు దోహదం చేసింది.

రంగాలవారీగా..

ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యుత్తు, చమురు, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ తదితర రంగాల సూచీలు 8 శాతం వరకు పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. 8 శాతం వరకు పుంజుకున్నాయి. దేశ జీడీపీపై వచ్చిన అంచనాలు కూడా మార్కెట్ ర్యాలీకి కలిసొచ్చినట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఇదిలావుంటే అదానీ గ్రూప్ షేర్లు ఇన్వెస్టర్లను విపరీ